# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 254 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం, 21 ఆగస్టు 2026 | పేజీలు :4




రాజీవ్ గాంధీకి ఘన నివాళి

4

# జనగామ కాంగ్రెస్‌లో 'కొండా' దుమారం!



- సీఎం రేవంత్ రెడ్డిపై సుస్మిత ఘాటు వ్యాఖ్యలు
- తనకేం సంబంధం అన్న మంత్రి కొండా సురేఖ
- సుస్మిత వ్యాఖ్యలను ఖండించిన జనగామ కాంగ్రెస్
- సురేఖను బర్తరఫ్ చేయాలి
- రిలే నిరాహార దీక్షకు దిగిన జనగామ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కంచె రాములు

సురేఖను బర్తరఫ్ చేయాలి

2వ పేజీలో..





## ఎర్రబెల్లి.. సొమ్మసిల్లి..!

### సాగునీరు విడుదల చేయాలని దయాకర్‌రావు పాదయాత్ర

- అడ్డుకున్న పోలీసులు
- సింగరాజుపల్లి ధర్నాలో తోపులాట
- మాజీ మంత్రి ఎర్రబెల్లికి గాయం

2



3

## రైతులు శాస్త్రీయ విధానాలు అవలంబించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచన
- నిబంధనల ప్రకారం ఎరువులు విక్రయించాలి
- నర్మెట మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన




**(ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా)**

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గ రాజకీయాల చుట్టూ మొదలైన ఈ వివాదం.. ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్సెస్ మంత్రి కొండా సురేఖ కుటుంబం అన్నట్లుగా మారింది. రెండు రోజుల కింద సీఎం రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై జనగామ కాంగ్రెస్‌లో 'దుమారం' రేపాయి.

### సీఎంపై సుస్మిత ఘాటు వ్యాఖ్యలు

ఇటీవల ఉమ్మడి వరంగల్‌లో జరిగిన ఓ సమావేశంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునివ్వడంపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్నికలకు ఇంకా గడువు ఉండగానే టికెట్ ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. 'ముఖ్యమంత్రి అయ్యాక కళ్లు నెత్తికెక్కాయా? బీసీలంటే అంత చులకనా?' అంటూ రేవంత్ రెడ్డిని ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే కొండా మురళికి గతంలో ఇచ్చిన ఎమ్మెల్సీ హామీని నిలబెట్టుకోలేదని ఆరోపించారు. 'అచ్చ కాంగ్రెస్.. పచ్చ కాంగ్రెస్' అంటూ విమర్శలు చేశారు.

### ఖండించిన జనగామ కాంగ్రెస్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత చేసిన అనుచిత వ్యాఖ్యలను జనగామ జిల్లా కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉంటూ ముఖ్యమంత్రిని, ఇతర మంత్రులను ఏకవచనంతో సంబోధిస్తూ విమర్శలు చేయడం తీవ్ర క్రమ శిక్షణా రాహిత్యమని మండిపడ్డారు.

> **నాకు సంబంధం లేదు : సురేఖ**
>
> **కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపడంతో మంత్రి కొండా సురేఖ స్పందించారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, అవి ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు.**

### మంత్రి సురేఖను బర్తరఫ్ చేయాలి : కంచె రాములు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ, మంత్రి కొండా సురేఖను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని టీపీసీసీ కార్యదర్శి , జనగామ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కంచె రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జనగామ డీసీసీ ఆఫీస్‌లో 48 గంటలు రిలే నిరాహార దీక్షకు దిగారు. కొండా సుస్మిత అనుచిత వ్యాఖ్యలపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'ఓ తండ్రి వయస్సు ఉన్న సీఎంపై తన వయసుకు మించిన మాటలు మాట్లాడిన సుస్మితకు అసలు కాంగ్రెస్ పార్టీతో ఏం సంబంధం ఉంది.. బీసీల గురించి బాధపడుతున్న నువ్వు ముందుగా నీ అయ్య.. అవ్వ.. దగ్గరికి వెళ్లి మంత్రిగా వారు బీసీలకు ఏం చేశారో అడుగు..' అంటూ మండిపడ్డారు. బీసీలపై కొండా సురేఖ కపట ప్రేమను ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. కొమురవెల్లి దేవస్థానం చైర్మన్ పదవిని రెడ్డి సామాజిక వర్గానికి ఎందుకు కట్టబెట్టారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తనపై కేసులు ఉన్నాయనే నెపంతో తనకు ఆ పదవి ఇవ్వలేదని చెబుతున్న సురేఖ, తీవ్రమైన కేసులు ఉన్న కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఎలా అడుగుతున్నారని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై 'అచ్చ కాంగ్రెస్.. పచ్చ కాంగ్రెస్' అంటూ విమర్శలు చేస్తున్న కొండా కుటుంబం గతంలో ఎన్ని పార్టీలు మారారో ఒక్కసారి గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. ముఖ్యమంత్రిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను కొండా సుస్మిత వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసే వరకు తన నిరసన పోరాటం ఆగదని రాములు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోక్కుంట్ల ప్రవీణ్, కౌన్సిలర్ పాముకుంట్ల ప్రసాద్ గౌడ్, సీనియర్ నాయకులు చింతకింది మల్లేష్, జాయ మల్లేష్, సమ్మయ్య, నసోమయ్య, రవి, కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్ మొగిలి భిక్షపతి, భిక్షపతి, యాదగిరి, రమేష్, శ్రీనివాస్, కిష్టయ్య పాల్గొన్నారు.



## సాగునీరు విడుదల చేయాలని
# ఎర్రబెల్లి పాదయాత్ర

- అడ్డుకున్న పోలీసులు
- సింగరాజుపల్లి ధర్నాలో తోపులాట
- మాజీ మంత్రి ఎర్రబెల్లికి గాయం



**దేవరుప్పుల, మన చౌరాస్తా :** దేవాదుల రిజర్వాయర్ నుంచి నీటి విడుదల నిలిచిపోవడంతో కాలువల్లో నీరు రాక పంట పొలాలు ఎండిపోతున్నాయని, వెంటనే సాగునీరు విడుదల చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని ధరావత్ తండా నుంచి బంజార గ్రామం వరకు నవాబుపేట రిజర్వాయర్ కాలువ వెంబడి సుమారు 10 కిలోమీటర్ల మేర ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా దారి పొడవునా ఎండిపోతున్న వరి పొలాలను పరిశీలించి, రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. పాదయాత్రలో భాగంగా ధరావత్ తండాకు చెందిన కున్సోతు వెంకన్న అనే రైతును ఎర్రబెల్లి పరామర్శించారు. ఇప్పటి వరకు 16 బోర్లు వేసినా చుక్క నీరు పడలేదని, సాగునీరు అందక నాలుగు ఎకరాల వరి పంట పూర్తిగా ఎండిపోయిందని ఆ రైతు ఎర్రబెల్లి వద్ద బోరున విలపించాడు. పంట నష్టంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్న సదరు రైతుకు ఆయన ధైర్యం చెప్పి, పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.30,000 చొప్పున పరిహారం చెల్లించి, బాధిత రైతు వెంకన్నను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సింగరాజుపల్లి గ్రామంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఎర్రబెల్లి పాల్గొన్నారు. నిరసన తెలుపుతున్న ఆయనను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య జరిగిన తోపులాటలో ఎర్రబెల్లి తలకు గాయమైంది. గాయపడినప్పటికీ ఆయన ధర్నాను కొనసాగించారు. అనంతరం పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి దేవరుప్పుల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దేవాదుల రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ రైతులకు అందించకపోవడం సరికాదని, పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల, కొడకండ్ల మండలాలకు నీరు వచ్చే వరకు తమ పోరాటం ఆగేది లేదని ఎర్రబెల్లి స్పష్టం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో దేవరుప్పుల, కొడకండ్ల, గుండాల మండలాలకు చెందిన రైతులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు

### రూ.1.20 కోట్ల జరిమానా

**జనగామ, మన చౌరాస్తా :** చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ.1.20 కోట్ల భారీ జరిమానా విధిస్తూ జనగామ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి జి. శశి కీలక తీర్పు వెలువరించారు. బాధితుడు గజ్జి మధు తెలిపిన వివరాల ప్రకారం.. రియల్ ఎస్టేట్, హోటల్ వ్యాపారాల్లో నష్టాలొచ్చాయని చెప్పిన గుండ్లగడ్డకు చెందిన మెండే సప్తగిరికి 2013లో రూ.కోటి రుణం ఇచ్చారు. ఆ తర్వాత డబ్బు తిరిగి చెల్లించమని కోరగా, సప్తగిరి రూ.40 లక్షల చొప్పున రెండు చెక్కులు (రూ.80 లక్షలు) ఇచ్చాడు. అయితే బ్యాంక్‌లో తగినంత నగదు లేకపోవడంతో ఆ చెక్కులు బౌన్స్ అయ్యాయి. దీంతో మధు కోర్టును ఆశ్రయించారు. బాధితుడి తరపు న్యాయవాది శ్రీరామ్ శ్రీనివాస్ వాదనలతో ఏకీభవించిన కోర్టు, నిందితుడు సప్తగిరిని సెక్షన్ 138 కింద దోషిగా నిర్ధారించింది. ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1.20 కోట్ల జరిమానా విధించింది. అందులో రూ.1,19,80,000ను బాధితుడు మధుకు పరిహారంగా చెల్లించాలని, మిగతా రూ.20 వేలు ప్రభుత్వానికి జమ చేయాలని ఆదేశించింది. జరిమానా చెల్లించకపోతే అదనంగా ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో స్పష్టం చేసింది.





# రైతులు శాస్త్రీయ విధానాలు అవలంబించాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచన

**నర్మెట, మన చౌరాస్తా :**

రైతులు రసాయన మందుల వినియోగాన్ని తగ్గించి, శాస్త్రీయ, ప్రకృతి ఆధారిత వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. గురువారం నర్మెట్ట గ్రామంలో పర్యటించిన కలెక్టర్, రైతులు సాగు చేస్తున్న మిర్చి, కందులు, కూరగాయల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు భిక్షపతి, వెంకట్ రెడ్డి పంట పొలాలను సందర్శించి డ్రిప్ సౌకర్యం, మొక్కల ఎదుగుదల, నీటి లభ్యత మరియు తెగుళ్ల నివారణ చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు క్రమం తప్పకుండా భూసార పరీక్షలు నిర్వహించాలని, దానికనుగుణంగానే ఎరువులు వాడాలని తెలిపారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించేలా సూక్ష్మ నీటిపారుదల (డ్రిప్) విధానాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో డీఏవో అంబికా సోనీ, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



**నిబంధనల ప్రకారం ఎరువులు విక్రయించాలి**

రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారమే యూరియా, ఎరువులను విక్రయించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గురువారం నర్మెట్ట మండల కేంద్రంలోని 'ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని' ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల్లో ఉన్న వివరాలు, వాస్తవ నిల్వలతో సరిపోలుతున్నాయా లేదా అని తనిఖీ చేశారు. ప్రతిరోజూ ఎరువుల రాక, విక్రయాలు, మిగిలిన నిల్వల సమాచారాన్ని బోర్డుపై పారదర్శకంగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. ఎరువుల నిల్వలు, అమ్మకాల విషయంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా సకాలంలో రైతులకు ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డీఏవో అంబికా సోని, ఏఈఓ జితేందర్, స్థానిక రైతులు పాల్గొన్నారు.



# అండర్ డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి : బీజేపీ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని 3, 4 వార్డుల సరిహద్దుల్లో ఉన్న సెయింట్ మేరీ స్కూల్ వద్ద 60 ఫీట్ల రోడ్డు అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా తవ్వేసి, అసంపూర్తిగా నిలిపివేయడం పట్ల బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్దోజు జగదీష్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. గురువారం నిలిచిపోయిన పనులను పరిశీలించి ఆయన మాట్లాడారు. సరైన ప్రణాళిక లేకుండా చేపట్టిన పనుల వల్ల ప్రధాన రహదారి పూర్తిగా మూతపడి కాలనీవాసులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల నిత్యం రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, కాలనీవాసులు తీవ్ర నరకాన్ని చూస్తున్నారని అన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ దారిని సరిగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిపుణులతో చర్చించి, సరైన ప్రణాళికా బద్ధంగా అండర్ డ్రైనేజీ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు దూసర శివకృష్ణ, చందులతో పాటు కాలనీవాసులు కొత్త కృష్ణ, శ్రీధర్ రెడ్డి, రమేష్, లక్ష్మి, దుర్గయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ధర్నా

**జనగామ, మన చౌరాస్తా :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, చదువుకున్న యువతకు నెలకు రూ.5,000 నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో జనగామ జిల్లా కలెక్టరేట్ ఎదుట గురువారం నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం తమ వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ సూపరింటెండెంట్ రవికిరణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ నరేందర్ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత పట్ల ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10 లక్షల పోస్టులతో పాటు రాష్ట్రంలో 2 లక్షల ఉద్యోగాలు, బ్యాక్‌లాగ్ పోస్టులు, 20 వేల పోలీసు ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జనగామ జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్‌తో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సింగారపు రమేష్, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, బెల్లంకొండ వెంకటేష్, పోతుకునూరి ఉపేందర్, చిట్యాల సోమన్న, కౌన్సిలర్ బూడిద జ్యోతి, నాయకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** సాయి నగర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సర్పంచ్ మ్యాకల వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో తొమ్మిది రకాల ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. బాలవికాస స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్టు సమన్వయకర్త దొవరి వసంత, ప్రాజెక్టు సమన్వయకర్త కనకం రాజ్‌కుమార్ సమక్షంలో ఈ కమిటీల ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురుచూడకుండా "మన గ్రామం-మన బాధ్యత" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ఐక్యతతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉన్న ఊరు కన్నతల్లితో సమానమని, గ్రామ రుణాన్ని తీర్చుకోవడానికి పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచాలని సూచించారు. సర్పంచ్ మ్యాకల వెంకన్న మాట్లాడుతూ, అందరం కలిసికట్టుగా పనిచేసి సాయి నగర్‌ను ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలబెడదామని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : రవి పాల్

**జనగామ, మన చౌరాస్తా :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని గెత్సేమనే ప్రార్థన మందిరం సీనియర్ సంఘకాపరి బ్రదర్ రవిపాల్ పిలుపునిచ్చారు. జనగామ పట్టణం ప్రగతినగర్‌లో సొసైటీ ఆఫ్ క్రైస్ట్ కరుణాపురం 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సొసైటీ ఫౌండర్ డాక్టర్ సంగాల పాల్సన్ రాజ్, డైరెక్టర్ డాక్టర్ జయప్రకాశ్ గోపు నిర్వహణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రదర్ రవిపాల్ మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యత లోపించడంతో మానవాళి మనుగడకే ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని వృక్షాలుగా పెంచే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గెత్సేమనే ప్రార్థన మందిరం సంఘకాపరి బ్రదర్ హనోకు, శ్రీకాంత్, సామాజికవేత్త జి. కృష్ణ, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ఇనుముల నర్సయ్య, సంఘ అధ్యక్షుడు మెకానిక్ రవి, ప్రధాన కార్యదర్శి కాగితాల రవి, సంఘ పెద్దలు ఎం. రాజు, కొంపెల్లి రామచంద్రం, కె. సిద్ధారెడ్డి, మేకల నరేష్, గుగులోతు బాలాజీ, మంద బాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ బిల్లులు చెల్లించాలి : డీఈ సారయ్య



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** స్టేషన్ ఘనపూర్ మునిసిపల్ పట్టణ కేంద్రంలో ఎన్పిడిసీఎల్ డిఈ బి.సారయ్య పర్యవేక్షణలో, ఏడిఈ పి.రణధీర్ రెడ్డి సమక్షంలో ఏపిటియస్ సిబ్బందితో సహా ఆరు ప్రత్యేక తనిఖీ బృందాలతో విద్యుత్ బకాయిల వసూలు కార్యక్రమం చేపట్టి 3లక్షల 40వేల విద్యుత్ బకాయిలను సిబ్బంది వసూలు చేశారు. కార్యక్రమంలో ఘనపూర్ ఏఈ పి.శంకర్, సబ్ ఇంజనీర్ సాధన, హరిత, ఎస్ఎల్ఐ ఎల్. రామాచారి, టౌన్ లైన్మెన్ వాసం శ్రీధర్, ఏఎల్ఎం నాగరాజు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక
శుక్రవారం, 21 ఆగస్టు 2026
Mana Chourasta


# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి



**మోటకొండూరు, మన చౌరాస్తా :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో భారత మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తన సొంత నిధులతో ఏర్పాటు చేయించిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముందు కొత్తగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులతో కలసి భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. దేశంలో సాంకేతిక విప్లవం, పంచాయతీ రాజ్ బలోపేతం, యువతకు ప్రాధాన్యత కల్పించడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని స్మరించుకున్నారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం హామీలను నెరవేరుస్తూ సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, రాజీవ్ గాంధీ ఆశయాల బాటలోనే పాలన సాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీకి ఘన నివాళి

**జనగామ, మన చౌరాస్తా :** కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ వైస్ ప్రెసిడెంట్లు ఉడత రవి యాదవ్, నూకల బాల్ రెడ్డి మాట్లాడుతూ.. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యంలో యువతకు కీలక పాత్ర కల్పించిన దూరదృష్టి కలిగిన నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ ఎండి అన్వర్, వేమల్ల పద్మ, అధికార ప్రతినిధి జక్కుల వేణుమాధవ్, కోశాధికారి సారభు మధు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిరా, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల మల్లేష్, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి శ్రీనివాస్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి వంగాల కళ్యాణి, ఆర్టీఏ మెంబర్ అభి గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## 'అమ్మ' ఆధ్వర్యంలో విద్యార్థులకు దుస్తుల పంపిణీ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని ధర్మకంచ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైట్ అండ్ వైట్ బట్టల షోరూమ్ యజమాని గజ్జి మధు సౌజన్యంతో దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ప్రధాన కార్యదర్శి వంగ భీమ్‌రాజ్ మాట్లాడుతూ.. విద్యాబోధన ద్వారానే పేదరికం నిర్మూలన సాధ్యమవుతుందని నమ్మి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు, స్టేషనరీ, పాదరక్షలు, మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా దుస్తులు అందించి దాతృత్వాన్ని చాటుకున్న గజ్జి మధును ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ స్వర్గం ప్రకాశం, పాఠశాల హెచ్‌ఎం ఎం. కనకయ్య, చంద్రశేఖర్, ఉపాధ్యాయ బృందంతో పాటు బెల్దే శ్రీధర్, కృష్ణ బజాజ్, మార్గం రవికుమార్, అమ్మ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కొయ్యడ రవి, ప్రతినిధులు పండుగ నరేష్, బింగి నరసింహులు, ఎండి పాషా, సిద్ధిరాల నవీన్, సిద్ధిరాల చందు, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల వైపు యువత అడుగులు వేయాలి




**జనగామ, మన చౌరాస్తా :** యువత, విద్యార్థుల్లో డ్రగ్స్, మద్యం, సిగరెట్, గుట్కా వంటి వ్యసనాలపై అవగాహన కల్పిస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు సోషల్ వాయిస్ ఫౌండేషన్ (Social VOICE Foundation) ఆధ్వర్యంలో జనగామలోని SPR పాఠశాలలో 'నషా ముక్త్ ఛాంపియన్‌షిప్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మంగళంపల్లి రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జేఏసీ కన్వీనర్ కన్నా పరశురాములు, డాక్టర్ రంజిత్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులతో నాషముక్త్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా చదువు, క్రీడలు మరియు ఆరోగ్యకరమైన జీవనవిధానంపై దృష్టి సారించాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ కీర్తి వీరేందర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చేలా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని కోరారు. ఛాంపియన్‌షిప్‌లో భాగంగా విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించి, "Say No to Drugs - Say Yes to Sports" అనే సందేశాన్ని అందించారు. వ్యసన రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు, యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని నిర్వాహకులు పేర్కొన్నారు.

wanted
విలేకరులు కావలెను
మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.
manachourasta@gmail.com
8555800812 9676400812
సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..
మన చౌరాస్తా
The Complete News way

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**